సాక్షి
పల్నాడు
ఆదివారం । 19 । మే । 2024



కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

ఫిరంగిపురం: వేమవరంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం శనివారం నిర్వహించారు. స్వామివారి ధ్వజాన్ని వాహనంపై ఊరేగించారు.

వాసవీమాతకు విశేష పూజలు



ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతిని శనివారం విశేషంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

న్యూస్‌రీల్

తెలంగాణ ఎంసెట్‌లో సోపిరాల విద్యార్థికి ర్యాంక్



చినగంజాం: తెలంగాణ రాష్ట్రంలో శనివారం విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన విద్యార్థి మంచి ర్యాంక్ సాధించారు. గ్రామానికి చెందిన నరహరి శ్రీహరిరావు కుమారుడు రోహిత్ శివశంకర్ రాష్ట్రస్థాయిలో 181వ ర్యాంక్ సాధించాడు. గతంలో జేఈఈ మెయిన్స్‌లోనూ 176వ ర్యాంక్ సాధించాడు. ఈ నెల 26న జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించేందుకు కృషి చేస్తున్నాడు. భవిష్యత్‌లో సివిల్ సర్వీస్ సాధించాలనేది తన సంకల్పం అని తెలిపాడు. రోహిత్ ర్యాంక్ సాధించడంపై సోపిరాల గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, బంధువులు అతనికి అభినందనలు తెలియజేశారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ అభినందనీయం



బాపట్ల: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం అభినందనీయమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషాను శనివారం ఆయన చాంబర్‌లో రెడ్‌క్రాస్ ప్రతినిధులు సన్మానించారు. జిల్లా ప్రజలంతా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా కలెక్టర్ కృషి చేశారని నారాయణభట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు సాధిక్ మాస్టర్, కళ్యాణలక్ష్మి పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్ట భద్రత

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో స్ట్రాంగ్ రూముల్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వెంట ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్‌ఓ సత్తిబాబు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి




కర్లపాలెం: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం కర్లపాలెంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రం కర్లపాలెంకు చెందిన ఉప్పాల పేరయ్య భార్య సరస్వతి(105) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

హ్యాండ్లూమ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేటరూరల్: ప్రముఖ విద్యాసంస్థ ప్రగడకోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి, తిరుపతిలలో డిప్లమో కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ గుంటూరు అధికారి వి.వనజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో 53సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్‌లోని నాలుగు సీట్లకు మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై, జులై 1 నాటికి బీసీ, జనరల్ కేటగిరి వారు 15 నుంచి 23 సంవత్సరాలు మధ్య వయసు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 15 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమో కోర్సులో ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఒకేషనల్(టెక్స్‌టైల్), ఐటీఐ రెండు సంవత్సరాలు కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా డిప్లమో రెండు సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తులు, ప్రవేశాలకు ఇతర వివరాలకు www.iihtvfr.com వెబ్‌సైట్ చూడాలన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 807.00 అడుగుల వద్ద ఉంది.



జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ బి.లఠ్కర్

ఉత్తర్వులు జారీచేసిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ బి.లఠ్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2011 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన లఠ్కర్ గతంలో ఏపీ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కోఆపరేషన్ డిపార్టుమెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2018 మార్చి నుంచి 2019 సెప్టెంబరు వరకు గుంటూరు కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై పల్నాడు కలెక్టర్‌గా రానున్నారు. ఇక్కడ రెండేళ్లకుపైగా పనిచేసిన ఎల్.శివశంకర్‌ను ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలకు బాధ్యులను చేస్తూ ఎన్నికల కమిషన్ బదిలీ చేసి అతనిపై విచారణకు ఆదేశించిన విషయం విదితమే.



జిల్లా ఎస్పీగా మలిక గర్గ్

ఉత్తర్వులు జారీచేసిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట: పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా మలిక గర్గ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె గతంలో కృష్ణా జిల్లా అదనపు ఎస్పీగా, ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకుపైగా పనిచేశారు. అనంతరం తిరుపతి ఎస్పీగా పనిచేశారు. మలిక గర్గ్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పోలీసు అధికారి. ఈమె రెండున్నరేళ్ల కిందట ఏర్పడిన పల్నాడు జిల్లాకు తొలి మహిళా ఎస్పీ కానున్నారు. ఎన్నికల సమయంలో నియమించబడి ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జి.బిందుమాధవ్ ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసిన విషయం విదితమే. మలిక భర్త వకుల్ జిందాల్ బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

సైకిల్ ఫ్యాక్షన్

- పల్నాడులో ఆగని టీడీపీ అరాచకాలు
- పచ్చనేతలకు పోలీసుల వత్తాసు
- వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడుల పర్వం
- తిరిగి ఆ పార్టీ కార్యకర్తలపైనే అక్రమ కేసులు
- ఇంటికి వెళ్లాలంటే భయమేస్తుంది అంటున్న ఫ్యాన్ పార్టీ కార్యకర్తలు
- అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ఊళ్లోకొస్తే చంపుతామంటున్నారు



మాచర్ల నియోజకవర్గం కారెంపూడిలో దాడులు చేస్తున్న టీడీపీ అల్లరి మూకలు (ఫైల్)

సాక్షి ప్రతినిధిగుంటూరు/పట్నంబజారు: ఊళ్లోకొస్తే చంపేస్తాం.. వైఎస్సార్ సీపీకి మద్దతుగా వ్యవహరిస్తారా .. ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. ఖచ్చితంగా మట్టుబెడతామంటూ.. తెలుగుదేశం పార్టీ నేతలు మరోమారు ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరతీశారు. పల్నాడు జిల్లాలో ఎన్నికల సాక్షిగా ప్రారంభమైన టీడీపీ నేతల దౌర్జన్యాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. అయినా పోలీసు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతోపాటు, వైఎస్సార్ సీపీ బాధితులపైనే తిరిగి కేసులు పెడుతున్నారంటూ ఆందోళన వ్యక్తమవుతోంది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం కొత్తగణేశునిపాడులో పచ్చ మూకలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. ఎన్నికల వేళ వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే కోపంతో వారిని మట్టుపెడతామంటూ ఇళ్లపైకి దండెత్తాయి. ఆటోలు, బైక్‌లు, 50కి పైగా ట్రాక్టర్లను ధ్వంసం చేశాయి. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను దొరికినవారిని దొరికినట్టు టీడీపీ మూకలు చితకొట్టాయి. చాలా మంది వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర గాయాలపాలై ప్రాణభయంతో ఊరు విడిచి పొలాల్లో తలదాచుకున్నారు. వీరికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఊళ్లొకొస్తే చంపుతామంటూ టీడీపీ నేతలు బాధిత కుటుంబాలను భయపెడుతున్నారు.

సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఎన్నికల వేళ టీడీపీకి వత్తాసు పలికిన అధికారులను బదిలీ చేడయంతోపాటు, ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పల్నాడు ప్రాంత వాసులు కోరుతున్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు హేయమైన చర్య అని, దానిని ప్రోత్సహించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే పల్నాడులో కొంత మంది పోలీసు అధికారుల వల్లే హింసాత్మక వాతావరణం నెలకొందని భావిస్తున్నారు.



మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామంలో టీడీపీ వర్గీయులు ధ్వంసం చేసిన బైకులు(ఫైల్)


కన్నాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు

పోలింగ్ సమయంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో అక్కడి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తన మార్క్ రౌడీయిజాన్ని చూపించారు. నియోజకవర్గంలోని చాగంటివారిపాలెంలో ఎన్నికల రోజు పోలీసులను అడ్డుపెట్టుకుని తన అనుచరులతో గూండాగిరి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రూరల్ సీఐ రాంబాబు ఇష్టానుసారం లాఠీచార్జి చేయడంతోపాటు, కర్కశంగా వ్యవహరించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాంచారయ్య అనే కానిస్టేబుల్ మహిళలు అని కూడా చూడకుండా దాడి చేశాడని, వైఎస్సార్ సీపీ కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని హింసకు తెగబడ్డారని చెబుతున్నారు. బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి అడ్డుకోబోతే కన్నా వర్గీయులు అతడిపై దాడిచేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు తీసుకోబోమని నేరుగా చెబుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల రోజున దమ్మాలపాడులో రిగ్గింగ్ జరుగుతుందని, తొండపిలో దౌర్జన్యం చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించేందుకు సీఐ రాంబాబుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, కనీసం తిరిగి సమాధానం చెప్పిన పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఖాకీ వేసుకున్న టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరించారని మండిపడుతున్నారు. సీఐ రాంబాబు, ముప్పాళ్ల మండలంలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు పడకుండా అడ్డుకోవడంతోపాటు, కన్నాకు తొత్తుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొంగుతున్న వాగులు

పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు వద్ద రాళ్లవాగు పొంగిపొర్లుతుంది. మేతకు వెళ్లిన జీవాలు, గేదెలు కొట్టుకుపోయాయి. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లలో పిడుగుపాటుకు యువ రైతు మృతి చెందాడు.

- వాగులో కొట్టుకుపోయిన జీవాలు, గేదెలు
- పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- పలుచోట్ల పిడుగుపాటు
- ఒకరు మృతి...దెబ్బతిన్న ఇళ్లు



వర్షం నీటితో ప్రవహిస్తున్న నాగులేరు



గుమ్మనంపాగు వద్ద ఉధృతంగా రాళ్లగడ్డ వాగు



దాచేపల్లి-కేసానుపల్లి గ్రామాల మధ్య పొంగి ప్రవహిస్తున్న వాగు

బొల్లాపల్లి: మండలంలో శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. వాగులు పొంగిపొర్లుతున్నాయి. గుమ్మనంపాడు, అయ్యన్నపాలెం, గరికపాడు, రేమిడిచర్ల తదితర ప్రాంతాల్లో సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి గుమ్మనంపాడు గ్రామ సమీపంలోని రాళ్లగడ్డ వాగు పొంగి ప్రవహిస్తుంది. మేతకు వెళ్లిన జీవాలు, గేదెలు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అదే గ్రామానికి చెందిన జూటూరి పెద వీరయ్య కుటుంబానికి చెందిన జీవాలు, వేర్వేరు రైతులకు చెందిన గేదెలు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కొట్టుకుపోవడంతో గాలింపు చేపట్టారు. అదే గ్రామంలో వీర్ల వెంకట్రావుకు చెందిన దాబా ఇల్లు పిడుగుపాటుకు గురై గోడలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడటంతో ప్రాణాపాయం తప్పింది. గుమ్మనంపాడు గ్రామంలో వాగు పొంగిపొర్లుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అకాల వర్షంతో సంభవించిన నష్టం అంచనా తెలియాల్సిఉంది.

నాగులేరుకు జలకళ

కారెంపూడి: జీవనదిగా చారిత్రక ప్రసిద్ధి చెందిన నాగులేరు చాలా రోజుల తర్వాత జలకళను సంతరించుకుంది. శనివారం కురిసిన భారీ వర్షానికి నాగులేరు వరద నీటితో ప్రవహించి కనువిందు చేసింది. నాగులేరు కారెంపూడి సమీపంలోని నల్లమల అడవులలో పుట్టి ఉత్తరంగా ప్రవహించి తంగెడ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ఈ మధ్యలో వాగు ఒడ్డున ఉన్న 12 గ్రామాలకు నాగులేరు నీటి వనరు బాగా ఉపయోగపడుతుంది. గ్రామాలలో భూగర్భ జలాలు పెరగడానికి ఇది దోహదం చేస్తుంది. దీంతోపాటు పశువులకు నీరు కూడా లభ్యం అవుతుంది. కారెంపూడిలో దాదాపు మూడు గంటలపాటు ఉరుములు మెరుపుల మధ్య భారీ వర్షం పడింది.

దాచేపల్లిలో భారీ వర్షం

దాచేపల్లి: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షం ప్రభావంతో వాగులు, కాలువలు పొంగి ప్రవహించాయి. నాగులేరులోకి భారీగా వర్షపునీరు చేరటంతో కళకళలాడింది. భారీ వర్షం నేపథ్యంలో కేసానపల్లిలోని వాగు పొంగి ప్రవహించటంతో రోడ్డుపై నీరు పారింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. వాగులో అనుమతులు లేకుండా కల్వర్టు నిర్మించటంతోనే వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించి వాహనాలు, ప్రజలు ఇబ్బందులు పడ్డారని గ్రామస్తులు తెలిపారు.

పిడుగుపాటుకు రైతు మృతి



ఈపూరు: పిడుగుపడి రైతు మృతిచెందిన సంఘటన ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగింది. కర్రి హనుమంతరావు (40) గేదెలు కాస్తున్న సమయంలో అకస్మాతుగా ఉరుములు, మెరుపులు రావడంతో స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈలోపే పిడుగుపడి హనుమంతరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. హనుమంతరావు మృతిని తట్టుకోలేక కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తుంది.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేటరూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వీవీప్యాట్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. మండలంలోని కాకాని సమీపంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను శనివారం అదనపు ఎస్పీతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భద్రతాపరమైన అంశాలలో సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. తొలుత లాగ్ బుక్‌లో సంతకాలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత అంశాలపై అదనపు ఎస్పీతో కలిసి కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాకు చెందిన ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోలైన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీప్యాట్‌లు అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అదనపు సూచనలు చేశారని తెలిపారు. ప్రజలు, మీడియా సంయమనం పాటించడం అత్యంత కీలకమన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు సామాజిక బాధ్యతతో అధికారికి ముందస్తు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్ ప్రాంతాలలో మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు, స్ట్రాంగ్ రూమ్ చుట్టుపక్కల 144 సెక్షన్ అమలులో ఉన్నదని, ప్రజలు ఎవరూ సదరు కాలేజీ చుట్టుపక్కల సంచరాదని హెచ్చరించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3500, గరిష్ట ధర రూ.5200, మోడల్ ధర రూ.4300 వరకు పలికింది.

నేటి నుంచి రంగనాథుని కల్యాణ మహోత్సవాలు



స్వామివారి నిజరూప దర్శనం

యడ్లపాడు: కాలగర్భంలో ఓ ఊరు కనుమరుగైంది. అప్పటి ఆలయంతోపాటు స్వామి వారు మాయమయ్యారు. కొన్నేళ్ల తర్వాత తిరిగి స్వామివారు ప్రత్యక్షం కాగా.. భక్తులు సంతోషించి ఓ ఆలయాన్ని నిర్మించారు. అందులో మళ్లీ జీర్ణోద్ధారణ గావించారు. శతాబ్దాల కిందట కనుమరుగైన ఊరు నేడు భౌతికంగా లేకపోయినా.. దివ్య స్వరూపుడైన ఆ స్వామి మరో గ్రామంలోని సుందర కోవెలలో కొలువుదీరాడు. నాటి చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచి భక్తులచే నేటికీ నిత్య పూజలు అందుకుంటున్నారు. ఆ మహిమాన్విత ఆలయమే పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం సొలస గ్రామంలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవాలయం. ఆదివారం నుంచి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు ప్రారంభ కానున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుని చేయడంతో ప్రారంభమై 22న రాత్రి 8 గంటలకు శ్రీదేవి, భూదేవి రంగనాథుల కల్యాణం నిర్వహించి 25న రాత్రి 8 గంటలకు పవళింపు సేవతో కల్యాణ వేడుకలు ముగుస్తాయి. ఏటా వైశాఖపౌర్ణమికి నాడు ప్రభుత్వం బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. ఏడాదిలో ఒకరోజు మాత్రమే స్వామి వారి నిజరూప దర్శనం ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత.

క్లుప్తంగా

మృతి చెందిన యువతి ఆచూకీ లభ్యం

- ఓటు హక్కు కోసం స్వగ్రామం ఉన్నవకు వచ్చి మృతి
- ఆస్పత్రి చెకప్‌కంటూ బైక్‌పై తీసుకెళ్లిన భర్త మాయం
- భార్య నీలం పెర్సీ మూడు రోజులు తర్వాత శవంగా దర్శనం

యడ్లపాడు: ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన యువతి విగతజీవిగా మారింది. అనుమానాస్పదంగా హైవే పక్కన పొలం గట్ల వద్ద శవంగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు భిన్నకోణాల్లో విచారణను కొనసాగించారు. యువతి బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పేర్లిపాడు వాసిగా గుర్తించారు. ఆమె స్వగ్రామం యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామం సూర్యనగర్ కాలనీకి చెందినట్లు తమ దర్యాప్తులో కనుగొన్నారు. ఎస్‌ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జీపీ ఆయిల్ మిల్లు సమీపంలో ఈనెల 15న యువతి మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి విచారణ చేపట్టారు.

మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన సుబ్బారావు, అన్నామణి దంపతుల కుమార్తె నీలం పెర్సీ(18). మూడేళ్ల కిందట బాపట్ల జిల్లాకు చెందిన వసంతకుమార్‌తో వివాహం అయింది. ప్రస్తుతం నీలం పెర్సీ నాలుగు నెలల గర్భిణి. ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు పెర్సీ పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులతో కలిసి తన ఓటు హక్కు వినియోగించుకుంది. సాయంత్రం భర్త వసంతకుమార్ ఉన్నవకు వచ్చి భార్యను ఆస్పత్రిలో చెకప్ చేయిస్తానంటూ బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటలకు వెళ్లిన వారిద్దరిలో పెర్సీ మూడు రోజుల తర్వాత శవమై కన్పించగా, భర్త ఆచూకీ నేటికీ లభించలేదు. పెర్సీ కుటుంబ సభ్యులు భర్తపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పెర్సీది హత్యా..ఆత్మాహత్య అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

అప్రమత్తంగా లేకుంటే అనర్థాలే.. ఓ వ్యక్తి నుంచి అతను వాడుతున్న స్మార్ట్ ఫోన్ తీసుకుని.. ఓ పది నిమిషాలు ఆ ఫోన్‌లోని సోషల్ మీడియాలో వచ్చే వీడియోలు చూస్తే సదరు వ్యక్తి ఆలోచనా విధానం, మానసిక స్థితిని ఇట్టే చెప్పేయొచ్చని పోలీసులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తులో ఎన్నో అనర్థాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో మెలకువలు తెలియని వ్యక్తులు.. వాటికి దూరంగా ఉండటమే మేలని సూచిస్తున్నారు.

అంతా చెప్పేస్తోంది!



వ్యక్తిత్వాన్ని డీకోడ్ చేస్తున్న సోషల్ మీడియా అల్గారిథమ్

- వ్యక్తిగత గోప్యతకు పెను సవాల్
- చూసే వీడియోలు, చేసే పోస్టులతో వ్యక్తుల మానసిక స్థితి అంచనా
- కొంప ముంచుతున్న డిజిటల్ సైకాలజీ
- ఖాతాదారుల యూఆర్‌ఎల్స్‌ను అమ్మేస్తున్న బ్లాగర్స్
- సమాచారంతోనే రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

పట్నంబజారు: స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న ప్రతి వ్యక్తిపై సోషల్ మీడియా అల్గారిథమ్ పెత్తనం చెలాయిస్తోంది. అత్యధికంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో సమయం గడుపుతున్న ప్రజల భద్రతకు ఇది పెనుసవాల్‌గా మారింది. నేటి తరంలో అత్యధికంగా జరుగుతున్న సైబర్ నేరాలకు సోషల్ మీడియా అల్గారిథమ్ సహాయకారిగా పనిచేస్తోందని పలువురు సైబర్ నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి ఆలోచనా సరళి(డిజిటల్ సైకాలజీ)ని ఈ అల్గారిథమ్ పూర్తిగా బట్టబయలు చేస్తోందని హెచ్చరిస్తున్నారు.

మనమేంటో చెప్పేస్తోంది..

సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్(ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, లింక్‌డిన్) వ్యక్తిగత గోప్యతను పూర్తిగా హరించేస్తున్నాయి. ఫేస్‌బుక్, యూ ట్యూబ్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగామ్, లింక్‌డిన్‌ల పని తీరు వెనుక జరిగే సెర్చ్ ఇంజిన్‌కు అనుసంధానంగా ఉండే అల్గారిథమ్ మ్యాపింగ్ వెనుక ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఆయా సోషల్ మీడియా వేదికల ద్వారా ఖాతాదారులు చూసే వీడియోలు, చేసే పోస్టులు, చదివే అంశాలు, చేసే లైక్‌లు, షేర్‌లు, చూసే సమయం, చేసే కామెంట్ ఆధారంగా వ్యక్తుల మానసిక స్థితి, ఆలోచన విధానం, అవసరాలు, అవసరం లేని అంశాలను, ఇష్టాలు, అయిష్టాలు, నడక, నడవడిక, చేసే వృత్తి, నిబద్ధత తదితర అంశాలను ఓ ప్రత్యేకమైన మ్యాపింగ్ ద్వారా అల్గారిథమ్ నూరు శాతం పసిగడుతుంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ సంబంధిత, ప్రభుత్వ/ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలకు, కామెడీ వీడియోలు/మీమ్స్, వంటలు, అశ్లీల వీడియోలు చూసే వ్యక్తులకు అలాంటి సంబంధిత వీడియోలు అల్గారిథమ్ ఇచ్చే సమాచారంతోనే స్మార్ట్ ఫోన్‌లకు చేరుకుంటున్నాయి. దీంతోనే స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి మానసిక స్థితితో పాటు అతని జాతకాన్ని పూర్తిగా అల్గారిథమ్ గుర్తించేస్తోంది.



సైబర్ నేరాలు వీటి వల్లే..

ఇటీవల కాలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కొన్ని బ్లాగ్స్.. వ్యక్తుల సోషల్ మీడియా అకౌంట్లతోనే వ్యాపారం సాగిస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. వ్యక్తుల మానసిక స్థితి ఆధారంగా ఫిల్టర్ చేసిన సోషల్ మీడియా యూఆర్‌ఎల్స్‌ను బ్లాగర్స్ దగ్గర నుంచి సైబర్ నేరగాళ్లు కొనుగోలు చేస్తున్నారు. ఉద్యోగం కోసం వెతికే వ్యక్తుల సమాచారంతో కూడిన యూఆర్‌ఎల్స్‌ను కొనుగోలు చేసిన సైబర్ నేరగాళ్లు వారి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ ఖాతా లింక్‌లు, ఫేక్ నోటిఫికేషన్‌లు పంపి ఉద్యోగాల ఆశ చూపి దోపిడీకి పాల్పడుతున్నారు. తక్కువ ధరకే వ్యవసాయ పరికరాలు అమ్మేస్తామని రైతులను, ట్రేడింగ్ లాభాలు చూపిస్తామని ఇన్వెస్టర్‌లను, డబ్బు అవసరం ఉన్న వారిని గుర్తించి లోన్స్ ఇప్పిస్తామని, అశ్లీల వీడియోలు చూసే వ్యక్తులను గుర్తించి.. వారికి వీడియో కాల్స్ చేసి హనీ ట్రాప్‌లకు తెగబడుతున్నారు. ఈ తరహా మోసాల్లో బాధితులైన వారు గుంటూరు నగరంలో వేల సంఖ్యలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అంతేకాక అల్గారిథమ్ ఇచ్చిన సమాచారంతో వ్యక్తుల యూఆర్‌ఎల్స్ కొనుగోలు చేసిన యాడ్ ఏజెన్సీలు వారికి అనుసంధానంగా ఉన్న కంపెనీలు యాడ్‌లను ఫోన్‌లో గుప్పిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ యాడ్‌ల ఆధారంగానే ఆన్‌లైన్ షాపింగ్ చేస్తూ పలువురు మహిళలు సైబర్ నేరాల బారిన పడుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి..

నగరంపాలెం: డిజిటల్ సమాచారం ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడాలని, ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లు అసలైనవా.. నకిలీవా అని తనిఖీ చేసుకోవాలని గుంటూరు సైబర్ క్రైం సీఐ షేక్ మౌలాషరీఫ్ సూచిస్తున్నారు. ఆయన తెలిపిన కొన్ని జాగ్రత్తలు..



- మీరు చేసే సెర్చ్ ఆధారంగానే మోసాలు జరుగుతుంటాయని తెలుసుకోవాలి. ఆన్‌లైన్ షాపింగ్ యాడ్స్ వచ్చినప్పుడు, సంబంధిత అధికారిక వెబ్ సైట్ తనిఖీ చేసుకోవాలి.
- ఉద్యోగ ప్రకటనలు వచ్చినప్పుడు విద్యార్థులు ఎక్కువ మోసపోతుంటారు. ప్రభుత్వాలు, మల్టీ నేషనల్ కంపెనీలు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వవని, ఏ విధమైన ఫీజులు అనధికారికంగా వసూలు చేయవని తెలుసుకోండి.
- అశ్లీల వెబ్ సైట్‌లు చూసినప్పుడు, వీడియో కాల్ రావడం బెదిరింపు కాల్స్ వస్తుంటాయి. ఎవరైనా ఆడియో/వీడియో కాల్ చేసి బెదిరిస్తే కంగారు పడకండి, ఇంటర్నెట్ ఆఫ్ చేసి వెంటనే సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.
- ప్రకటనలు రాకుండా చేసుకునే వీలు గూగుల్ సెట్టింగ్స్‌లో ఉంటుంది. ప్రైవసీ సెట్టింగ్స్ అనే ఫీచర్స్ వినియోగించుకుని మీ అకౌంట్‌కు తగు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకోండి.
- అనధికారిక లింక్‌లు ఓపెన్ చేయకూడదు. మెయిల్స్, ఫోన్ కాల్స్ ద్వారా వచ్చే బెదిరింపులకు కంగారు పడకండి.

అనుమానితుల ఇళ్లల్లో సోదాలు



నరసరావుపేటటౌన్: ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో శనివారం ఒన్ టౌన్ పరిధిలో వరవకట్ట, రామిరెడ్డిపేట, శాలెంనగర్ ప్రాంతాల్లో సీఐ కృష్ణారెడ్డి తన పోలీసులతో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. మారణాయుధాలు, రాళ్లు, పెట్రోలు బాంబుల కోసం గాలింపు నిర్వహించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఘర్షణలో 10 కేసులు నమోదు

దాచేపల్లి: సాధారణ ఎన్నికల సమయంలో, ముగిసిన తరువాత జరిగిన ఘర్షణలో 10 కేసులు నమోదు చేసినట్లు సీఐ ఎ.సురేంద్రబాబు శనివారం తెలిపారు. మండలంలోని కేసానుపల్లిలో జరిగిన ఘర్షణలో 21మందిపై కేసులు నమోదు చేశామని, మాదినపాడు జరిగిన ఘర్షణలో 37మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తంగెడ, ఇరికేపల్లిల్లో జరిగిన ఘర్షణలో 61మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో కొంతమందిని అరెస్ట్ చేయగా మరి కొంతమంది పరారీలో ఉన్నట్లు సీఐ చెప్పారు.

ఘనంగా మ్యూజియం డే వేడుకలు

అమరావతి: స్థానిక పురావస్తు సంగ్రహాలయ ప్రాంగణంలో శనివారం ఇంటర్నేషనల్ మ్యూజియం డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ పురావస్తు సర్వేక్షణ విభాగం సూపరింటెండెంట్ డాక్టర్ జె.గోపీనాథ్ మాట్లాడుతూ గత చారిత్రక వైభవాన్ని స్మరించుకుంటూ, చారిత్రక కట్టడాలను, శిల్పకళను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కనుమరుగైపోతున్న భారతీయ చారిత్రక చిహ్నాలను భవిష్యత్ తరాల వారికి అందించటానికి అందరు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు విద్య–మ్యూజియం పరిశోధన అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



వక్తృత్వపోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దేబేంద్రనాథ్ బోయ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యప్రకాష్‌రావు, శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీతా రామాంజనేయులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో పోలీస్ కవాతు



దాచేపల్లి: గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని సీఐ ఎ.సురేంద్రబాబు తెలిపారు. ప్రత్యేక పోలీస్ బలగాలతో శనివారం నారాయణపురం, దాచేపల్లిలో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి పాల్గొన్నారు.

ఉప్పలపాడులో పోలీసుల తనిఖీలు



వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల్లో జరుగుతున్న గొడవలకు కారణంగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో రూరల్ సీఐ సుధాకర్‌బాబు, ఐనవోలు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీల్లో భాగంగా మండలంలోని అల్లర్లు జరిగే గ్రామాల్లో కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నూజెండ్ల, రెడ్డికొత్తూరు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కారెంపూడి విధ్వంసకాండ కేసుల్లో 20 మంది అరెస్టు

కారెంపూడి: కారెంపూడిలో అల్లర్లు, ఆస్తుల విధ్వంసకాండకు సంబంధించిన కేసుల్లో 20 మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చినట్లు కారెంపూడి సీఐ నారాయణస్వామి శనివారం విలేకర్లకు తెలిపారు. కారెంపూడిలో టీడీపీ కార్యాలయంపై దాడి, జెడ్పీ హైస్కూలు వద్ద కారు దహనం తదితర దాడుల ఘటనలకు పాల్పడిన కేసులో వైఎస్సార్‌సీపీకి చెందిన 10 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత కారెంపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరుల ఇళ్లపై దాడులకు పాల్పడి పలు బైక్‌లను దహనం చేసిన చేసిన కేసులో టీడీపీకి చెందిన 10 మందిని అరెస్టు చేశామన్నారు. వారందరిపై పోలీసులు నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి గురజాల కోర్టుకు హాజరు పర్చగా న్యాయమూర్తి వారందరికి 14 రోజుల రిమాండ్ విధించారు.